క్లుప్తంగా

ఎస్సీ, ఎస్టీ కేసుల్లో మృతుల కుటుంబాలకు పింఛను మంజూరు చేయాలి



బాపట్ల: జిల్లాలో ఎస్సీ, ఎస్టీ కేసుల్లో రిలీఫ్, ఉద్యోగాల మంజూరులో పురోగతి లేదని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు నీలం నాగేంద్రరావు బాపట్ల జిల్లా సంయుక్త కలెక్టర్ సుబ్బారావుకు ఫిర్యాదు చేశారు. కలెక్టరేట్‌లో జేసీ సుబ్బారావును మంగళవారం కలిసి వినతిపత్రం అందించారు. ఎస్సీ, ఎస్టీ హత్య కేసుల్లో బాధితులకు అడిషనల్ రిలీఫ్‌గా ఇచ్చే స్పెషల్ మంత్లీ పెన్షన్ బిల్లులు చేయడం లేదని జేసీ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఎస్సీ, ఎస్టీ కేసుల్లో రిలీఫ్ కోసం ఎంత బడ్జెట్ అవసరమో ప్రతిపాదనలు పంపకపోవడం వల్ల రాష్ట్ర ప్రభుత్వం నుంచి బడ్జెట్ కేటాయించలేదని ఫలితంగా బాధితులు నష్టపోతున్నారని వివరించారు. బాపట్ల జిల్లాలో నమోదైన ఎస్సీ ఎస్టీ కేసుల్లో ఎఫ్ఐఆర్, చార్జ్‌షీట్ రిలీఫ్‌లతో పాటు, స్పెషల్ మంత్లీ పెన్షన్లకు ఎంత మొత్తం నిధులు అవసరమో అంచనా వేయించాలన్నారు. సీ సెక్షన్ సూపరింటెండెంట్ మల్లేశ్వరిని పిలిపించి ఎస్సీ, ఎస్టీ కేసుల పెండింగ్ ఫైల్స్, బడ్జెట్ గురించి నివేదిక రూపొందించాలని జేసీ సుబ్బారావు ఆదేశాలు ఇచ్చారు.

నూజివీడు ట్రిపుల్ ఐటీకి కొల్లూరు విద్యార్థిని



కొల్లూరు : తమ పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థిని కొలకలూరి ప్రేమకీర్తన ట్రిపుల్ ఐటీలో సీటు సాధించినట్లు కొల్లూరు బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సీహెచ్. ఉషాకుమారి తెలిపారు. పదో తరగతి ఫలితాల్లో 588 మార్కులు సాధించిన ప్రేమకీర్తన నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించడం పట్ల ఎంఈఓలు వెంకటేశ్వర్లు, జ్యోతి, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. విద్యార్థిని ప్రభుత్వ పాఠశాలల విభాగంలో కొల్లూరు మండలంలో ప్రథమ స్థానం, బాపట్ల జిల్లాలో ద్వితీయ స్థానం సాధించినట్లు ప్రధానోపాధ్యాయురాలు తెలిపారు.

19న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

కర్లపాలెం: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 19న శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీపీ యారం వనజ అధ్యక్షతన నిర్వహించ నున్నామని ఎంపీడీవో నేతాజీ బుధవారం తెలిపారు. ఈ సమావేశానికి మండల పరిధిలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

కొనసాగుతున్న ఆక్రమణల తొలగింపు



తెనాలి అర్బన్: పట్టణంలో మురుగు కాల్వల పూడికతీత, ఆక్రమణల తొలగింపు పనులు స్పెషల్ డ్రైవ్ కింద నిర్వహిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పేర్కొన్నారు. బోసురోడ్డులో మంగళవారం ఆక్రమణల తొలగింపును ఆయన పరిశీలించారు. వ్యాపారులు కొందరు అడ్డుకోవడంతో వారితో మాట్లాడి పనిని కొనసాగించారు. మురుగు కాల్వల మీద ఉన్న బండ్లను, ఫ్లోరింగ్‌ను జేసీబీతో తొలగింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజలకు అసౌకర్యం కలుగకుండా పలు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. మురుగు కాల్వలోని పూడికతీత పనులు కొనసాగుతున్నట్లు తెలిపారు. అనంతరం 27వ వార్డులో పర్యటించారు.

అక్కడ జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించారు. ఆయన వెంట ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, ఏసీపీ సుబ్బారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఆకురాతి రామచంద్రరావు, లక్ష్మీనారాయణ, పలువురు టౌన్ ప్లానింగ్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

సైజు తగ్గిన కోడిగుడ్డు.. గుత్తేదారుకు లేదు అడ్డు

- మధ్యాహ్న భోజన పథకానికి చిన్నసైజు కోడిగుడ్లు సరఫరా
- అడ్డగోలు అవినీతికి పాల్పడుతున్న కాంట్రాక్టర్లు
- జగనన్న గోరుముద్ద పథకంపై నాటి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ
- నేటి ప్రభుత్వంలో పీఎం పోషణ్ పేరుతో పథకం నిర్వహణ
- పట్టించుకోని అధికార యంత్రాంగం

దోచుకునే అవకాశం వస్తే చాలు పిల్లల నోటిదగ్గర కూడు సైతం దోచుకునేందుకు అక్రమార్కులు వెనుకాడటం లేదు. విద్యార్థులకు ఆరోగ్య వంతమైన పౌష్టికాహారం అందించాలనే సంకల్పంతో గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న గోరుముద్ద పథకం నీరు గారుతోంది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పీఎం పోషణ్ పేరుతో అందించే పౌష్టికాహారంలో వారానికి 5 సార్లు భోజనంతో పాటు గుడ్డు కూడా అందివ్వాలి. ఈ క్రమంలో చిన్న పాటి సైజులో ఉన్నటువంటి గుడ్లను పాఠశాలలకు, అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిణీ చేస్తూ కాంట్రాక్టర్లు జేబులు నింపుకుంటున్నారు. అధికారులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎన్నిసార్లు హెచ్చరిస్తున్నా ఫలితం లేకుండా పోతుంది.



విద్యార్థులకు అందిస్తున్న చిన్నసైజు కోడిగుడ్లు



ఆటో ద్వారా పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలకు కోడిగుడ్ల సరఫరా

భట్టిప్రోలు: బాపట్ల జిల్లా పరిధిలోని 25 మండలాల్లో 1,751 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 3,500 మంది విద్యార్థులు చదువులు సాగిస్తున్నారు. వీరికి మధ్యాహ్న భోజనంతో వారంలో 5 సార్లు కోడిగుడ్లు అందిస్తారు. అలాగే ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో భట్టిప్రోలు మండలంలో 65 కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 6 సంవత్సరాల లోపు పిల్లలతో పాటు బాలింతలు, గర్భిణులకు సైతం కోడిగుడ్లు అందిస్తున్నారు. అలా ప్రతి గుడ్డుకు ప్రభుత్వం రూ .5.89 పైసలు చెల్లిస్తుంది. ఈ రేటు అనేది ఆన్‌లైన్ నెక్ మార్కెట్ (విజయవాడ) నిర్ణయం ప్రకారం చెల్లిస్తుంటారు. గత జూన్ నెలలో గుడ్డు ధర రూ.4.95 పైసలు, రవాణాతో కలిపి రూ. 5.89 పైసలు చొప్పున రేటు చెల్లించడం జరిగింది. ఏప్రియల్ నెలలో అన్ని కలుపుకుని రూ.5 కంటే తక్కువగా గుడ్డు ధర రూ.4.80 పైసలు పడింది.

చిన్నసైజు గుడ్లు సరఫరా..

మధ్యాహ్న భోజనం అమలవుతున్న ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ సెంటర్లకు కాంట్రాక్టర్ వారానికి సరిపడా గుడ్లు సరఫరా చేస్తారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వీళ్ల సరఫరా చేసే కోడిగుడ్డు 45 నుంచి 50 గ్రాములు ఉండాలి. ఐతే కాంట్రాక్టర్ సరఫరా చేసే గుడ్లు మాత్రం 30 నుంచి 35 గ్రాములు లోపే ఉంటున్నాయి. బిల్లులు చెల్లిస్తున్నా నాసిరకం, చిన్నసైజు గుడ్లు పంపిణీ చేస్తున్నారు. ఒక్కోసారి గుడ్లు కుళ్లిపోతున్నాయి. అధికారులు కాంట్రాక్టర్లకు చెబుతున్నా చిన్నసైజు గుడ్లు పంపుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలకు సరఫరా చేసే గుడ్ల వివరాలను మండల విద్యాశాఖాధికారికి అందిస్తే ఆయన జిల్లా కార్యాలయానికి పంపిస్తారు. లక్షలాది రూపాయల బిల్లులు తీసుకుంటూ నాసిరకమైన గుడ్లు పంపిణీ చేయడం చూస్తూ ప్రభుత్వ అధికారులు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారో అర్థం కావటం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

చిన్నసైజు గుడ్లు తీసుకోవొద్దని చెబుతున్నాం



చిన్నసైజు గుడ్లు వస్తే తీసుకోవద్దని ప్రధానోపాధ్యాయులకు చెబుతున్నాం. మండలంలోని పలు పాఠశాలలను తనిఖీ చేసిన సమయంలో గుడ్లు పరిశీలించి తక్కువ సైజు ఉన్న వాటిని ప్రత్యేకంగా పక్కన పెడుతున్నాం. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 45 గ్రాములు కన్నా ఎక్కువగా ఉన్న కోడిగుడ్లను మాత్రమే కాంట్రాక్టర్లు సరఫరా చేయల్సి ఉంది.

–పి.లాజర్, ఎంఈవో, భట్టిప్రోలు.

చందోలులో ఘనంగా హరిద్రశృంగారార్చన



పిట్టలవాని పాలెం: మండలంలోని చందోలు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ బగళాముఖి అమ్మవారి దేవాలయంలో మంగళవారం హరిద్ర శృంగారార్చన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. బండ్లమ్మ వారిని వివాహ ప్రదాయిని మహా గౌరీదేవీగా అలంకరించారు. దీంతో పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజలు జరిపించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

బాపట్లటౌన్: రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలైన సంఘటన పట్టణంలోని డీఎం పల్లి సమీపంలో చోటు చేసుకుంది. డీఎం పల్లికి చెందిన బొనిగల సౌజన్య బాపట్ల పురపాలక సంఘంలో కార్మికురాలిగా విధులు నిర్వహిస్తుంది. మంగళవారం సాయంత్రం విధులు ముగించుకొని ఇంటికి వెళ్తుండగా డీఎం పల్లి సమీపంలో చీరాల నుంచి బాపట్ల వైపు వస్తున్న గుర్తు తెలియని ద్విచక్రవాహనం ఢీకొట్టింది. ఈ సంఘటనలో సౌజన్యకు గాయాలయ్యాయి. బాధితురాలి ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రైతులకు నేరుగా సేవలందించటం అదృష్టం

ఐటీసీ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ రామచంద్రారెడ్డి

బాపట్ల: రైతులకు నేరుగా సేవలు అందించే అవకాశం వ్యవసాయ విద్యార్థులకే ఉందని ఐటీసీ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ బి.ఎస్.రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. బాపట్ల వ్యవసాయ కళాశాల 79వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా మంగళవారం కళాశాల్లో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ శాస్త్రవేత్తలు అందించే సేవలు రైతులకు నేరుగా అందేందుకు వారధిగా వ్యవసాయ విద్యార్థులు ఉండాలని సూచించారు.

ఎంతో చరిత్ర కలిగిన కళాశాల్లో చదవటం మంచి అవకాశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ గాజుల రామచంద్రరావు, కళాశాల డీన్ డాక్టర్ పి.ప్రసూనరాణి, గోపిచంద్, బాలినేని వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు జ్ఞాపికలు అందిస్తున్న విశ్వవిద్యాలయం పాలకులు

ఉద్యోగికి సేవలతోనే గుర్తింపు



చుండూరు(భట్టిప్రోలు): చుండూరు మండలం చినపరిమిలోని చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ మేనేజర్‌గా పని చేస్తున్న కె.మణికంఠ పవన్‌కుమార్ ద్వారకా తిరుమల బ్రాంచ్‌కి బదిలీ కావడంతో మంగళవారం బ్యాంక్ సిబ్బంది ఆయనను ఘనంగా సన్మానించారు. రెండున్నర ఏళ్లు బీఎంగా పని చేసి ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించి మన్ననలు పొందిన పవన్ కుమార్‌ను పలువురు అభినందించారు. కార్యక్రమంలో బదిలీపై ఏలూరు నుంచి ఇక్కడకు వచ్చి నూతనంగా బాధ్యతలు చేపట్టిన బీఎం కటారి నాగరాజు, అసిస్టెంట్ మేనేజర్ జ్యోతిర్మయి, బ్యాంక్ సిబ్బంది గాజుల హిమజ, చీకటి బసవ షైనీ, ఉన్నం సౌమ్య, మాచర్ల వీరేంద్ర, చుండూరు సర్పంచ్ జొన్నకూటి నాగేశ్వరరావు, గ్రామ పెద్దలు అవుతు వెంకటేశ్వరరెడ్డి, జంగా రమణారెడ్డి, ఆరుమళ్ల శివప్రసాద్ రెడ్డి, తమ్మా జయ రామకోటిరెడ్డి, వెలుగూరి రామప్రసాద్, జవ్వాది రామ మనోహర్, కారుమూరు సోమారెడ్డి, దేవిరెడ్డి వెంకట చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఏకధాటి వర్షాలతో అన్నదాతల ఆందోళన

వేమూరు: గత కొద్ది రోజులుగా ఏకధాటిగా కురుస్తున్న వర్షాలతో వరి విత్తనాలు 1000 ఎకరాల్లో దెబ్బతినడం జరిగిందని మండల వ్యవసాయాధికారి చందోలు సునీత మంగళవారం తెలిపారు.

వేమూరు మండలంలోని రైతులు 3000 హెక్టార్లలో వెద సాగు చేశారు. మురుగునీటి పారుదల సౌకర్యం లేని పొల్లాలో నీరు నిలిచి 1000 ఎకరాల్లో విత్తనాలు మురిగిపోయే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పొలాల్లో నిల్వ ఉన్న నీటిని బయటకు పంపించే విధంగా ఏర్పాట్లు చేసుకోవాలని ఆమె చెప్పారు. విత్తనం వేసిన వెంటనే వర్షం రావడంతో ఆలస్యంగా మొలక రావడం జరుగుతుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు తెలిపారు. రైతులు భయపడాల్సిన పని లేదన్నారు.

గ్రామాలను సమష్టిగా అభివృద్ధి చేసుకుందాం

- ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ రాజు
- పిట్లలవానిపాలెంలో మండల పరిషత్ సమావేశానికి హాజరు
- అపరిష్కృత సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చిన ప్రజా ప్రతినిధులు



మాట్లాడుతున్న బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మరాజు, అధికారులు, ప్రజాప్రతినిధులు

పిట్టలవానిపాలెం: పార్టీలకు అతీతంగా గ్రామాలను అభివృద్ధి చేసుకుందామని బాపట్ల శాసన సభ్యులు వేగేశనం నరేంద్ర వర్మరాజు అన్నారు. పిట్టలవాని పాలెం మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్వ సభ్య సాధారణ సమావేశం ఇన్‌చార్జి ఎంపీపీ దెందుకూరి సీతారామరాజు అధ్యక్షతన నిర్వహించారు. మండలస్థాయి అధికారులు ఆయా శాఖల వారీగా నిర్వహిస్తున్న కార్యక్రమాలను వివరించారు. తొలుత తహసీల్దార్ కె.స్ఫూర్తి మాట్లాడుతూ రెవెన్యూ పరంగా గత రెండు నెలలుగా ఎన్నికల పనుల్లో నిమగ్నం కావడంతో చాలా పనులు నిలిచిపోయాయని అన్నారు. ప్రస్తుతం పెండింగ్ పనులపై దృష్టి సారించినట్లు చెప్పారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం ఏఈ భాగ్యరాజ్ మాట్లాడుతూ జలజీవన్ మిషన్ పథకం కింద అన్ని గ్రామాలలో ఇంటింటికీ మంచినీటి కొళాయిలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కోమలి గ్రామ సర్పంచ్ శ్యామల నాగిరెడ్డి మాట్లాడుతూ కోమలి గ్రామంలో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని సమస్యను పరిష్కరించాలని కోరారు. గతంలో చందోలు పంట కాలువలో దొరువు పద్ధతిలో రూ.కోటి రూపాయల వ్యయంతో పైలెట్ ప్రాజెక్టును నిర్మించి సంగుపాలెం, కోడూరు, కోమలి గ్రామాలకు తాగునీటిని అందించే విధంగా చర్యలు తీసుకున్నారని అయితే ప్రస్తుతం పూర్తి స్థాయిలో నీరు అందడం లేదని తెలిపారు. గ్రామాలలోని చెరువులను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి తాగునీటి సమస్యకు పరిష్కార మార్గం చూపిద్దామని ఎమ్మెల్యే సూచించారు. సంగుపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయంలో మరుగుదొడ్ల సౌకర్యం లేకపోవడం వల్ల మహిళా ఉద్యోగులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని సంగుపాలెం ఎంపీటీసీ సభ్యులు గంగయ్య తెలిపారు. అల్లూరు గ్రామ సచివాలయ భవనం అసంపూర్తిగా ఉందని ఉద్యోగులకు కూర్చునేందుకు కార్యాలయం లేక రోడ్డుపై ఉంటున్నారని అల్లూరు, అలకాపురం గ్రామాల మధ్య గల తుపాన్ షెల్టర్‌ను కొద్ది పాటి పనులు చేయించి కార్యాలయం ఏర్పాటు చేయాలని అలకాపురం గ్రామ సర్పంచ్ మంతెన గంగరాజు కోరారు. కొత్తపాలెం గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యాలయం లేదని పరిశీలించి చర్యలు తీసుకోవాలని గ్రామ సర్పంచ్ వెంకటేశ్వరరెడ్డి కోరారు. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మరాజుకు మాజీ ఎంపీపీ షేక్ బాజీ, ఇన్‌చార్జి ఎంపీపీ దెందుకూరి సీతారామరాజు, పాలక వర్గ సభ్యులు చేబ్రోలు కృపానందం, దొంతిరెడ్డి సింధు, పలువురు ప్రజా ప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం నీడలో అంగన్‌వాడీ కేంద్రాలు

- ఏడు నెలలు కావస్తున్నా కేంద్రాలకు చేరని పీపీ–1, పీపీ–2 పుస్తకాల కిట్లు
- ఉన్న పుస్తకాలతోనే విద్యా బోధన
- పుస్తకాలు లేక చిన్నారులను కాన్వెంట్‌లకు పంపిస్తున్న తల్లిదండ్రులు
- దృష్టి సారించని అధికార యంత్రాంగం



భట్టిప్రోలు అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు విద్యాబోధన

భట్టిప్రోలు: బాల్యదశలోనే విజ్ఞానం పెంపొందించడంతో పాటు ఆంగ్ల మాధ్యమంలో చిన్నారులు పట్టు సాధించేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అంగన్‌వాడీ కేంద్రాలలో వీరికి ఆటపాటలతో కూడిన బొమ్మల పుస్తకాలను గత ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు అందచేసేది. కేంద్రాలకు వచ్చే 3 నుంచి ఆరేళ్ల లోపు చిన్నారులకు ఆంగ్ల బోధనను అందించాలనే ఉద్దేశ్యంతో నాలుగు పుస్తకాలతో కూడిన పీపీ–1, పీపీ–2 కిట్లు అందించింది. కాన్వెంట్ తరహాలో ఆంగ్ల బోధన అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించడం ద్వారా పిల్లలను తల్లిదండ్రులు అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించేవారు. బోధనకు సంబంధించి 3–4 ఏళ్ల లోపు చిన్నారులకు ఆంగ్లం, గణితం, స్పోకెన్ ఇంగ్లీష్, యాక్టివిటీ, డ్రాయింగ్‌కు సంబంధించిన 5 పుస్తకాలతో కూడిన పీపీ–1 కిట్లు, 4–5 ఏళ్ల వయసు కలిగిన చిన్నారులకు ఐదు పుస్తకాలతో కూడిన పీపీ–2 కిట్లు అందించేవారు.

పాత పద్ధతిలోనే బోధన..

వేమూరు నియోజకవర్గంలోని అమృతలూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో 308 కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 6 సంవత్సరాల లోపు పిల్లలు 9,118 మంది ఉన్నారు. వీరు మాత్రమే అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తారు. 7 నెలల నుంచి అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుతున్న చిన్నారులకు పీపీ–1, పీపీ–2 పుస్తకాలు నేటి వరకు అందకపోవడంతో పాత పద్ధతిలోనే బోధిస్తున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై నెల రోజులు దాటుతున్నా ప్రభుత్వం ఇంకా పుస్తకాలు అందించలేదు. ఈ పుస్తకాల్లో చిన్నారులకు ఎంతగానో ఉపయోగపడే పాఠ్యంశాలు ఉండటంతో తల్లిదండ్రులు విధిగా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపేవారు. అయితే ఈ ఏడాది నేటి వరకు పుస్తకాలు రాకపోవడంతో ఇప్పటికే చాలా మంది తల్లిదండ్రులు తమ చిన్నారులను కాన్వెంట్‌లలో చేర్పించారు. చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాల్లో చేరే విధంగా వారికి అవసరమైన వసతులు కల్పించాల్సి ఉన్నా ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు.



చిన్నారులకు బోధించే పీపీ–1, పీపీ–2 పుస్తకాలు

కొత్త పుస్తకాలొస్తే కేంద్రాలకు పంపిస్తాం..

ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి కొత్త పుస్తకాలు ఇంకా ప్రభుత్వం నుంచి రాలేదు. వచ్చిన వెంటనే అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించడం జరుగుతుంది. ప్రస్తుతం కేంద్రాల్లో ఉన్న పుస్తకాలతోనే చిన్నారులకు బోధిస్తున్నాం.

–విజయలక్ష్మి, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారిణి, అమృతలూరు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

సీపీఎం బాపట్ల జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య

భట్టిప్రోలు: గ్రామసభల ద్వారా ప్రభుత్వం కౌలు రైతులను గుర్తించి కౌలు కార్డులను ఇవ్వాలని సీపీఎం బాపట్ల జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య డిమాండ్ చేశారు. మంగళవారం భట్టిప్రోలులోని సీపీఎం కార్యాలయంలో జి. నాగరాజు అధ్యక్షతన పార్టీ మండల కమిటీ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన గంగయ్య మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటికీ పంట, మురుగు కాల్వల మరమ్మతులు చేయక పోవడం విచారకరమన్నారు. కృష్ణ డెల్టా ప్రాంతంలో చివరి భూముల వరకు నీరు చేరేందుకు కాల్వ మరమ్మతు పనులు నిర్వహించలేదని అన్నారు. బాపట్ల జిల్లాకు రూ.12 కోట్లు కేటాయించామని అధికారులు కాగితాల్లో చూపుతున్నారే తప్ప మరమ్మతులు చేసిన దాఖలాలు లేవన్నారు. మురుగు కాల్వల్లో గుర్రపు డెక్క, తూటికాడ తొలగింపు పనులు నిర్వహించక పోవడం వల్ల పంటలు ముంపు బారిన పడే అవకాశం ఉందని తెలిపారు. రైతు భరోసా, పంట నష్ట పరిహారం, ఎరువుల సబ్సిడీ ఇలా ఏది తీసుకోవాలన్నా కౌలు కార్డు తప్పని సరి అని వెంటనే కౌలు కార్డులు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు టి.కృష్ణమోహన్, మండల కమిటీ సభ్యులు మురుగుడు సత్యన్నారాయణ, రామస్వామి, దీపాల సత్యన్నారాయణ, పి.అహరోను, పి.మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.



హెలినరాణి మృతి తీరని లోటు

వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు

ఆలపాడు(వేమూరు): వైఎస్సార్ సీపీ క్రియాశీలక కార్యకర్త కూచిపూడి హెలినరాణి గుండె పోటుతో మరణించడం పార్టీకి తీరని లోటని వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు అన్నారు. చుండూరు మండలంలోని ఆలపాడు గ్రామానికి చెందిన కూచిపూడి హెలినరాణి మంగళవారం గుండెనొప్పితో మృతి చెందారు. వరికూటి అశోక్‌బాబు మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. హెలిన రాణి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. కుటుంబ సభ్యులకు పార్టీ సహకారం పూర్తిగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామపార్టీ అధ్యక్షుడు అమర్తలూరు సాంబశివరావు, చేబ్రోలు బోడియ్య, కూచిపూడి బుజ్జిబాబు, కూచిపూడి రోహిత్, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



హెలిన మృతిదేహం వద్ద నివాళులర్పిస్తున్న వరికూటి అశోక్‌బాబు

